క్లుప్తంగా

డెప్యూటీ సీఎం నారాయణస్వామి వెంటే ఉంటాం



మాట్లాడుతున్న అన్నూరు సర్పంచ్ సుందర రాజు

తిరుపతి కల్చరల్: తాము ఉప ముఖ్యమంత్రి నారాయణ స్వామి వెంటే ఉంటామని కార్వేటినగరం మండలం అన్నూరు సర్పంచ్ సుందరరాజు తెలిపారు. ఆయన శుక్రవారం ప్రెస్‌క్లబ్‌లో విలేకరులతో మాట్లాడారు. తామంతా వైఎస్సార్ సీపీ కుటుంబ సభ్యులమని తెలిపారు. తాము గ్రామ సమస్యలను మాత్రమే మీడియాకు తెలిపామని, వాటిని కొంతమంది వక్రీకరించారని పేర్కొన్నారు. 2024 ఎన్నికల్లోనూ డెప్యూటీ సీఎం నారాయణస్వామి వెంటే ఉండి ఆయన గెలుపుకునకు కృషి చేస్తామన్నారు. ఎంపీటీసీ పొన్నుస్వామి మాట్లాడుతూ గ్రామ ప్రజల అభిప్రాయంతో జ్యూస్ ఫ్యాక్టరీని పునః ప్రారంభిస్తామని తెలిపారు.

గృహ నిర్మాణాల పరిశీలన



గృహ నిర్మాణాలను పరిశీలిస్తున్న అధికారులు

నింద్ర: మండలంలోని అత్తూరులో పూర్తి చేసిన జగనన్న గృహ నిర్మాణాలను మండల అధికారులు శుక్రవారం పరిశీలించారు. లబ్ధిదారులతో మాట్లాడారు. త్వరలో గృహ ప్రవేశాలు చేయాలని కోరారు. ఎంపీడీఓ వేణు, హౌసింగ్ ఏఈ శ్రీధర్ రాజు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

కోలాహలంగా 'జమదగ్ని తపస్సు మాను'



తిరుమణ్యంలో భక్తులకు చేస్తున్న అన్నదానం

వడమాలపేట : మండలంలోని తిరుమణ్యం రాజులకండ్రిగ ఆది ఆంధ్రవాడలో రేణుకా మాతమ్మ కొలువు ఉత్సవాలు ఘనంగా నిర్వహిస్తున్నారు. ఐదు రోజుల కొలువులో భాగంగా శుక్రవారం జమదగ్ని తపస్సు మాను ఎక్కే కార్యక్రమాన్ని కోలాహలంగా నిర్వహించారు. భక్తులకు ఆర్టీసీ జయచంద్ర కుటుంబ సభ్యులు అన్నదానం చేశారు. ఆలయానికి 50వేల విరాళంగా అందజేశారు.

ప్రభుత్వ బడుల్లోనే మెరుగైన విద్య



పిల్లలకు అడ్మిషన్లు ఇస్తున్న ఉపాధ్యాయులు

వెదురుకుప్పం: ప్రభుత్వ బడుల్లోనే మెరుగైన విద్యను అందిస్తున్నట్లు ప్రధానోపాధ్యాయుడు శంకర్ అన్నారు. మండలంలోని బలిజమొండి వెంగనపల్లె గ్రామంలో శుక్రవారం స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. గ్రామంలో తల్లిదండ్రులతో మాట్లాడి పిల్లలను స్థానిక పాఠశాలలో చేర్పించారు. ఆయన మాట్లాడుతూ కార్పొరేట్ స్థాయి కన్నా మిన్నగా ప్రభుత్వ బడులు రూపుదిద్దుకున్నట్లు వివరించారు. కార్యక్రమంలో తల్లిదండ్రుల కమిటీ చైర్మన్ సురేంద్రం, ఉపాధ్యాయులు బండి ప్రభాకర్‌రెడ్డి, పీతంబరరెడ్డి, సరస్వతి, ధనంజయులు పాల్గొన్నారు.

మహాభారత యజ్ఞం ప్రారంభం



ధ్వజారోహణం నిర్వహిస్తున్న ఆలయ అర్చకులు

శ్రీరంగరాజపురం: తయ్యూరు పాయకట్టు అంకనపల్లి మహాభారతం ఉత్సవాలు శుక్రవారం ఉదయం ప్రారంభమయ్యాయి. ద్రౌపదీ సమేత పాండవుల విగ్రహాలకు అభిషేకం నిర్వహించారు. ధ్వజారోహణం చేసి మహాభారతం యజ్ఞాన్ని ప్రారంభించారు. ఈ నెల 12 నుంచి 25వ తేదీ వరకు ఈ యజ్ఞం కొనసాగుతుందని ఆలయ ధర్మకర్త లింగారెడ్డి తెలిపారు. దీనికి ఉభయదారులుగా మాణిక్యాచారి, దామోదరాచారి, వేణుగోపాలాచారి వ్యవహరించారు. నిర్వాహకులు రామనాథరెడ్డి, లోకనాథరెడ్డి, జగన్నాథ నాయుడు, పురుషోత్తం, డిసెంబర్ శెట్టి, గండు, జనార్దన్, బాబు పాల్గొన్నారు.

చండీ రుద్రయాగంలో శ్రీకాళహస్తి ప్రచార రథం



రేణిగుంట: విజయవాడలో శుక్రవారం శ్రీ చండీ రుద్ర రాజ శ్యామల సుదర్శన సహిత శ్రీ లక్ష్మీ మహా యజ్ఞం ప్రారంభమైంది. 17వ తేదీ వరకు జరగనున్న ఈ యజ్ఞంలో శ్రీకాళహస్తి దేవస్థానం ప్రచార రథం పాల్గొంది. శ్రీకాళహస్తి దేవస్థానం ప్రతిబింబంతో కూడిన ప్రచార రథంలో స్వామి, అమ్మవార్ల ప్రతిమలను అక్కడి భక్తులు దర్శించి మొక్కులు తీర్చుకున్నారు.

నిష్పక్షపాతంగా అర్హులకు పథకాలు

- 'గడప గడపకు మన ప్రభుత్వం'లో మంత్రి ఆర్కేరోజా



లబ్ధిదారురాలికి పథకాల లబ్ధి బుక్‌లెట్ ఇస్తున్న మంత్రి ఆర్కేరోజా

నగరి : గత టీడీపీ ప్రభుత్వంలో అరకొరగా అమలు చేసిన సంక్షేమ పథకాలను పక్షపాత ధోరణితో కేవలం ×పచ్చ×చొక్కాలకే ఇచ్చారని, ప్రస్తుత వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ప్రభుత్వం రాజకీయాలకు అతీతంగా నిష్పక్షపాతంగా అర్హులందరికీ ఇస్తోందని రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక, యువజన సర్వీసుల, క్రీడాశాఖ మంత్రి ఆర్కేరోజా స్పష్టం చేశారు. శుక్రవారం మున్సిపల్ పరిధి 2వ వార్డు కాకవేడు సచివాలయ పరిధిలోని ఒంటిండ్లు, మిట్టిండ్లు, కాకవేడు దళితవాడ, బీసీ కాలనీలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని ఆమె నిర్వహించారు. తొలుత వైఎస్సార్ విగ్రహానికి, రాజ్యాంగ నిర్మాత డాక్టర్ అంబేడ్కర్ విగ్రహానికి ఆమె పూలదండలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఆమె పార్టీ నాయకులు, సచివాలయ కన్వీనర్లు, గృహసారథులు, వలంటీర్లతో ప్రతి ఇంటినీ ఆమె సందర్శించారు. అవ్వా బాగున్నావా? తాతా ఫించన్ అందుతోందా? అమ్మ అమ్మ ఒడి ఆసరా అందుతోందా? బాబూ బాగా చదువుతున్నావా? అంటూ ప్రతి ఒక్కరినీ ఆప్యాయంగా పలకరించారు. సంక్షేమ బుక్‌లెట్‌లోని వివరాల మేరకు పథకాలు వర్తించాయా, లేదా? లబ్ధిదారులతో మాట్లాడారు.. సంక్షేమ పథకాల అమలులో ఏవైనా లోటుపాట్లు ఉంటే వాటిని తెలుసుకుని పరిష్కరించేందుకే ఈ కార్యక్రమం ఉద్దేశమని చెప్పారు. అలాగే సమస్యలపై ఆరా తీశారు. తమ ప్రభుత్వం కులమతాలు, పార్టీలను చూడటం లేదని, ప్రజల అర్హతలను మాత్రమే పరిగణనలోకి తీసుకొని పథకాలు ఫలాలు అందిస్తోందన్నారు.అందుకే ప్రతి ఇంటా సంక్షేమ వెలుగులు చిమ్ముతున్నాయన్నారు. ప్రజా సంక్షేమం కోసం పరితపించే జగనన్నకు ప్రజలందరూ అండగా నిలిచి మళ్లీ ఆయనను ముఖ్యమంత్రి చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ పీజీ నీలమేఘం, వైస్ చైర్మన్ వెంకటరత్నం, మున్సిపల్ కమిషనర్ వెంకట్రామిరెడ్డి, హౌసింగ్ డీఈ శంకరమ్మ, మెప్మా అధికారి సునీత, పార్టీ నాయకులు మునివేలు, రాజముత్తు, బాలవర్ధనరాజు, చిన్నదొరై, ఖాజా, సూర్యకుమార్, ధనంజయులు, ప్రకాష్, మణి, ధనంజయులు, అయ్యప్ప, వేలు, కుమరేశన్, నరేష్, అన్నాదొరై, రామూర్తి తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా అంతర్జాతీయ నర్సుల దినోత్సవం



హెడ్ నర్స్ దిల్షాద్‌ను సన్మానిస్తున్న డాక్టర్లు

పుత్తూరు రూరల్: నర్సుల సేవలు శ్లాఘనీయమని స్థానిక వైద్య విధాన పరిషత్ వైద్యాధికారి డాక్టర్ శంకర్ నరేష్ అన్నారు. శుక్రవారం స్థానిక ఆసుపత్రిలో అంతర్జాతీయ నర్సుల దినోత్సవం ఘనంగా నిర్వహించారు. స్టాఫ్ నర్స్ దిల్షాద్‌కు శాలువ కప్పి సత్కరించారు. డాక్టర్ మాట్లాడుతూ, రోగులు సంపూర్ణ ఆరోగ్యవంతుల్ని చేయడంలో నర్సులు చేస్తున్న సేవలు ఎనలేనివన్నారు. ప్రత్యేకించి కరోనా సమయంలో ధైర్యంగా తమ విధులను నిర్వహిస్తూ, కొందరు ప్రాణత్యాగం చేయడం వారి త్యాగనిరతికి నిదర్శనమని స్మరించారు. గైనకాలజిస్ట్ డాక్టర్ ప్రశాంతి, నర్సులు పాల్గొన్నారు.

పిల్లలు బడిలోనే ఉండాలి



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీడీవో మోహన్ మురళి

కార్వేటినగరం: బడిఈడు పిల్లలు బడిలో ఉండేలా చూడాలని ఎంపీడీవో మోహన్‌మురళి అన్నారు. ఆర్కేఎస్సార్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో శుక్రవారం ఎంఈవో విజయకుమార్ ఆధ్వర్యంలో శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఎంపీడీవో మాట్లాడుతూ ఇంటింటికీ తిరిగి బడీడు పిల్లలను విధిగా గుర్తించి బడిలో చేర్పించాలని అన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు ప్రభుత్వం అందిస్తున్న సౌకర్యాలను విద్యార్థుల తల్లిదండ్రులకు వివరించి ప్రభుత్వ పాఠశాలలో చేరేలా అవగాహన కల్పించాలని సూచించారు. వచ్చే విద్యా సంవత్సరానికి విద్యార్థుల సంఖ్య పెంచేలా చూడాల్సిన బాధ్యత ఉపాధ్యాయులపై ఉందన్నారు. ఈ కార్యక్రమంలో ఈవోపీఆర్డీ లక్ష్మీపతి, ఏఈ నాగభూషణం, అంగన్‌వాడీ పర్యవేక్షకులు ఇందిరా, మహిళా పోలీసులు, ఇంజనీరింగ్ అసిస్టెంట్లు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

అంగన్‌వాడీ పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం

పుత్తూరు రూరల్: పుత్తూరు ఐసీడీఎస్ ప్రాజెక్టు పరిధిలోని అంగన్‌వాడీ కేంద్రాల్లో ఖాళీల భర్తీకి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు సీడీపీఓ పద్మజ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. 1 మినీ అంగన్‌వాడీ పోస్టు, 6 అంగన్‌వాడీ సహాయకుల పోస్టులకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు వివరించారు. పుత్తూరు పరిధిలోని వినాయకపురం ఎస్టీ కాలనీలో మినీ అంగన్‌వాడీ వర్కర్ పోస్టు (ఎస్టీ)కి కేటాయించినట్లు తెలిపారు.

అంగన్‌వాడీ సహాయకుల (ఆయా) పోస్టులు

పుత్తూరు మండలం చినరాజుకుప్పం ఓసీ, నేసనూరు బీసీ–ఏ, రామకృష్ణాపురం ఓసీ, వడమాలపేట మండలం కదిరిమంగళం బీసీ–ఏ, అబ్బికండ్రిగ ఓసీ, అప్పలాయిగుంట ఓసీ(ఈడబ్ల్యూఎస్)లకు కేటాయించినట్లు వివరించారు. మినీ అంగన్‌వాడీ వర్కర్, హెల్పర్ల పోస్టులకు అభ్యర్థుల వయస్సు 21 నుంచి 35 ఏళ్ల లోపు ఉండాలని, 10వ తరగతి ఉత్తీర్ణులై, స్థానిక వివాహిత మహిళ అర్హులని తెలిపారు. ఎస్సీ, ఎస్టీ కేటగిరి అభ్యర్థులు 7వ తరగతి ఉత్తీర్ణులైన వారు అర్హులని వివరించారు.

సమష్టి కృషితోనే మండలాభివృద్ధి



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ సరిత

శ్రీరంగరాజపురం : ప్రజాప్రతినిధులు, అధికారులు సమష్టిగా కృషి చేస్తేనే మండలాభివృద్ధి సాధ్యమని ఎంపీపీ సరిత అన్నారు. మండల అభివృద్ధి కార్యాలయంలో శుక్రవారం ఎంపీపీ అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ సమావేశం దృష్టికి వచ్చిన సమస్యలపై ప్రజా ప్రతినిధులు, అధికారులు తక్షణమే స్పందించాలని సూచించారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలు ప్రతి ఒక్కరికీ అందేలా చూడాలని కోరారు. వేసవిలో తాగునీటి ఎద్దడి లేకుండా చూడాల్సిన బాధ్యత అధికారుల దేనని చెప్పారు. పంచాయతీలో ఎక్కడబడితే అక్కడ గోతులు తవ్వుతున్నారని వారిపై చర్యలు తీసుకోవాలని కొత్తపల్లె సర్పంచ్ డిల్లయ్య ఫిర్యాదు చేశారు. ఆర్‌ఎంపీ డాక్టర్లు అబార్షన్ చేస్తూ ప్రజల జీవితాలతో చెలగాటమాడుతున్నారని, వారిపై చర్యలు తీసుకోవాలని ప్రజాప్రతినిధులు కోరారు. ఈ సమావేశంలో జెడ్పీటీసీ రమణప్రసాద్ రెడ్డి, ఎంపీడీఓ కృష్ణయ్య, తహసీల్దార్ లోకనాథపిళ్లై ప్రజాప్రతినిధులు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

నేటి నుంచి 'పినాకా' ఉచిత శిక్షణ

నగరి : నిరుద్యోగ యువతకు పినాకా సంస్థ అధినేత బి.యాదగిరి ఐఆర్‌ఎస్ ఆధ్వర్యంలో ఉచిత స్పోకెన్ ఇంగ్లిష్, పర్సనాలిటీ డెవలప్‌మెంట్ శిక్షణ కార్యక్రమం శనివారం నుంచి ప్రారంభం కానుందని ఎంఈఓ శ్రీదేవి తెలిపారు. జూన్ 2వ తేదీ వరకు స్థానిక ఎస్‌జీఎస్ (జీహెచ్‌ఎస్) బాలికల ఉన్నత పాఠశాలలో శిక్షణ ఇస్తారన్నారు. బ్యాంకింగ్, గ్రూప్ డిస్కషన్, సివిల్ సర్వీసెస్, రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగాలు, రైల్వే, స్టాఫ్ సెలక్షన్ కమిషన్ పోటీ పరీక్షలకు ఈ శిక్షణ ఉపయోగపడుతుందన్నారు. అలాగే, అభ్యర్థులకు మధ్యాహ్నం ఉచిత భోజన సౌకర్యం కల్పించి స్టడీ మెటీరియల్ కూడా నిర్వాహకులు ఇస్తారన్నారు. 2017 నుంచి ప్రతి ఏటా ఈ ఉచిత శిక్షణ ఇస్తున్నారని, దీనిని గ్రామీణ ప్రాంతాల అభ్యర్థులు సద్వినియోగం చేసుకుని కొందరు ప్రభుత్వ, ప్రైవేటు సెక్టార్లలో మంచి ఉద్యోగాలు సైతం పొందినట్లు పేర్కొన్నారు. దాదాపు వందమంది వరకు ఉచిత శిక్షణ ఇస్తారని, పూర్తి వివరాలకు కోర్సు డైరెక్టర్ 9394566440 (మునస్వామి) నంబరును సంప్రదించాలన్నారు.

వైభవంగా అష్టమి పూజలు







ప్రత్యేక అలంకరణలో కాలభైరవ స్వామి, పూజలకు హాజరైన భక్తులు, నింద్ర: అలంకరణలో మహాలక్ష్మి

నగరి : స్థానిక కామాక్షీ సమేత కరకంఠేశ్వర ఆలయంలో శుక్రవారం కాలభైరవాష్టమి పూజలు ఘనంగా నిర్వహించారు. అష్టమిని పురస్కరించుకుని పాలు, పెరుగు, చందనం, పన్నీరుతో అభిషేక అర్చనలు, రాహుకాల పూజలు చేశారు. పుష్ప మాలలు, వడమాలలతో చేసిన అలంకరణ భక్తులను విశేషంగా ఆకట్టుకుంది. స్వామికి ఫలపుష్పాలు సమర్పించి, ప్రత్యేక అర్చనలు చేసి, కర్పూర హారతులు ఇచ్చారు. భక్తులకు ఆలయ నిర్వాహకులు తీర్థప్రసాదాలు అందజేశారు.

మహాలక్ష్మికి ప్రత్యేక పూజలు

నింద్ర: మండలంలోని కేఆర్ పాళెంలో శుక్రవారం మహాలక్ష్మి అమ్మవారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు చేశారు. నైవేద్యం సమర్పించారు. గ్రామస్తులు పాల్గొన్నారు.

పడవేటమ్మకు విశేష పూజలు



ప్రత్యేక పుష్పాలంకరణలో అమ్మవారు

పాలసముద్రం : మండలంలోని మిద్దినత్తం గ్రామంలో వెలసిన పడవేటమ్మకు శుక్రవారం గ్రామస్తులు విశేష పూజలు చేశారు. ఉదయం అర్చకులు అమ్మవారిని సుప్రభాత సేవతో మేల్కొల్పి పంచ ద్రవ్యాలతో అభిషేకం చేశారు. మధ్యాహ్నం గ్రామంలోని మహిళలు అమ్మవారి ఆలయ ప్రాంగణంలో పొంగళ్లు పెట్టి నైవేద్యం సమర్పించారు. సాయంత్రం ఆలయాన్ని పిండిదీపాలతో వెలిగించి భక్తులు తెచ్చిన వివిధ పుష్పాలతో అమ్మవారిని అందంగా అలంకరించి భక్తులకు దర్శన భాగ్యం కల్పించారు.

'రోజ్‌గార్ దివస్'ను విజయవంతం చేయండి



కూలీలతో మాట్లాడుతున్న ఏపీఎం చంద్రశేఖర్

శ్రీరంగరాజపురం : 'రోజ్‌గార్ దివస్' కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఉపాధి హామీ ఏపీఎం చంద్రశేఖర్ అన్నారు. ఆయన శుక్రవారం ఉపాధి కూలీలకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ప్రభుత్వం ప్రారంభించిన 'రోజ్‌గార్ దివస్' కార్యక్రమాన్ని ఫీల్డ్ అసిస్టెంట్, కూలీల సహకారంతో విజయవంతం చేయాలన్నారు. కూలీలకు 100 రోజుల పనిదినాలను కల్పించి, సుస్థిర అభివృద్ధి సాధించడమే లక్ష్యం అన్నారు. అనంతరం చిన్నమాకులపల్లి, నెలవాయి, క్షీరసముద్రం, వెంకటాపురం పంచాయతీల్లో జరుగుతున్న పనులను పరిశీలించారు.

సచివాలయ ఉద్యోగుల విచారణ



విచారణ చేస్తున్న డీఎల్‌డీఓ రవికుమార్

పాలసముద్రం : మండలంలోని నరసింహపురం, వనదుర్గాపురం, తిరుమలరాజుపురం, బాలక్రిష్ణాపురం గ్రామ సచివాలయ ఉద్యోగులపై ఇచ్చిన ఫిర్యాదు మేరకు శుక్రవారం డీఎల్‌డీఓ రవికుమార్ వారిని విచారణ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ, గ్రామ సచివాలయాల ఉద్యోగులు బాధ్యతగా పనిచేయడం లేదని, సమయపాలన పాటించలేదన్న ఫిర్యాదులు వచ్చాయని చెప్పారు. ఈ ఫిర్యాదు మేరకు సచివాలయ ఉద్యోగులను విచారణ చేసి నివేదికను ఉన్నతాధికారుల అందజేస్తామని తెలిపారు.

'ఇదో చారిత్రక నిర్ణయం'

నగరి : చుక్కల భూములకు పరిష్కారం చూపడం చారిత్రక నిర్ణయమని మాజీ ఎంపీపీ ఎఎం మనోహర్ (చిన్ని) అన్నారు. ప్రభుత్వం చుక్కల భూములకు శాశ్వత పరిష్కారం చూపుతూ తీసుకొన్న నిర్ణయాన్ని ఆయన స్వాగతించారు. 20 వేల కోట్ల విలువగల 2,06,171 ఎకరాల చుక్కల భూములకు సంపూర్ణ హక్కును కల్పించడం ద్వారా 91,471 రైతు కుటుంబాలు లబ్ధి పొందుతున్నాయని, వారందరూ ముఖ్యమంత్రికి జీవితాంతం రుణపడి ఉంటారన్నారు.

రామగిరికి పోటెత్తిన భక్తులు



పిచ్చాటూరు: అష్టమి పురస్కరించుకుని మండలంలో రామగిరిలోని శ్రీ కాళికాదేవి సమేత సంతాన కాలభైరవ స్వామి ఆలయానికి శుక్రవారం భక్తులు పోటెత్తారు. ఆలయ అర్చకులు ఆలయంలో కొలువుదీరిన శ్రీకాళికాదేవి సమేత కాళభైరవ స్వామి, శ్రీ వాలీశ్వర స్వామి, శ్రీ మరగదాంబిగకు ఉదయం ప్రత్యేక అభిషేక పూజలు చేసి పలు రకాల పుష్పాలతో విశేష అలంకారం చేశారు. మహిళలు ప్రమిదలు, గుమ్మడికాయలతో నేతి దీపాలు వెలిగించి మొక్కులు చెల్లించారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు వేలాది భక్తులు అష్టమి పూజల్లో పాల్గొని స్వామివారి సేవలో తరించారు. మధ్యాహ్నం ఆలయ ప్రాంగణంలో దాతలు భక్తులకు అన్నదానం చేశారు. మన రాష్ట్రం కన్నా తమిళనాడు ప్రజలు అధిక సంఖ్యలో ఈ పూజలకు వస్తున్నట్లు అర్చకులు చెప్పారు. ఇది పల్లవుల కాలం నాటి ప్రాచీన ఆలయం కావడం ఆలయంలో క్షేత్రపాలకునిగా కాలభైరవ స్వామి కొలువై ఉన్నారు. అష్టమి ఏర్పాట్లను ఆలయ ప్రధాన అర్చకులు శంకర్ రాజ్ గురుక్కళ్, సిబ్బంది పర్యవేక్షించారు.

మంత్రి చొరవతో ఓబీఆర్ కండ్రిగకు టూరిజం బస్సు



ఓబీఆర్ కండ్రిగలో టూరిజం భక్తులు

వడమాలపేట : మండలంలోని ఓబీఆర్ కండ్రిగ పంచాయతీ వెదళ్ల చెరువు దగ్గర ఉన్న ఉమామహేశ్వర ఆలయ దర్శనానికి ఏపీ టూరిజం బస్సును పర్యాటక శాఖ మంత్రి ఆర్కే రోజా ఏర్పాటు చేశారు. ఆలయ ధర్మకర్త, సభ్యుల విజ్ఞప్తిపై ఆమె స్పందించారు. శుక్రవారం నుంచి పుణ్య క్షేత్రాలను సందర్శించే బస్సును ఈ ఆలయానికి వచ్చేలా ఏర్పాటు చేశారు. ఈ బస్సు తిరుపతి నుంచి బయలుదేరి తిరుచానూరు, అప్పలాయగుంట, నారాయణవనం, నాగలాపురం, కార్వేటినగరంలోని శ్రీవారి ఆలయాలను దర్శించుకుని ఇక్కడికి వచ్చేలా చేశారు. ఇదలా ఉంచితే, ఇక్కడ ఆహ్లాదకరమైన వాతావరణం ఉండడంతో త్వరలో వెదళ్ల చెరువులో బోటింగ్ ఏర్పాటు చేయడానికి చర్యలు తీసుకుంటామని మంత్రి రోజా హామీ ఇచ్చారని ధర్మకర్త, సభ్యులు తెలిపారు. కార్యక్రమంలో సర్పంచులు శ్రీవిద్య, లలిత్‌కుమార్, మాజీ జెడ్పీటీసీ సభ్యుడు సురేష్‌రాజు, నాయకులు రమేష్‌రాజు, అరుణ్‌కుమార్, ఆలయ ధర్మకర్త, సభ్యులు త్యాగరాజు, సుబ్రమణ్యంరాజు, శివరాజు పాల్గొన్నారు.

ఆస్తి పత్రాల పంపిణీ



ఓటీఎస్ లబ్ధిదారులతో కుమారస్వామిరెడ్డి

పుత్తూరు రూరల్: ఆస్తి పత్రాల పంపిణీతో లక్షల మంది సొంతింటి కలను సాకారం చేసిన ఘనత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే దక్కిందని వైఎస్సార్‌సీపీ నేత వై.కుమారస్వామిరెడ్డి అన్నారు. శుక్రవారం పుత్తూరు పట్టణ పరిధిలోని 299 మంది లబ్ధిదారులకు జగనన్న సంపూర్ణ గృహ హక్కు పథకం కింద రిజిస్ట్రేషన్ పత్రాలను పంపిణీ చేసి ఆయన మాట్లాడారు. సొంతింటిపై సర్వ హక్కులు పొందడమే వన్ టైమ్ సెటిల్‌మెంట్ (ఓటీఎస్) పథకమన్నారు. దీని ద్వారా లబ్ధిదారులకు ఇంటిపై సర్వహక్కులు లభిస్తాయని, అత్యవర పరిస్థితుల్లో ఆ పత్రాలతో బ్యాంకు రుణాలు పొందవచ్చన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ కెఎల్‌ఎన్ రెడ్డి, చైర్మన్ హరి, వైస్ చైర్మన్లు శంకర్, జయప్రకాష్, మైనారిటీ ఫైనాన్స్ డైరెక్టర్ మాహీన్, కౌన్సిలర్లు, గుణశేఖర్, ఏకాంబరం, భువనేశ్వరి, రాధ, విజయలక్ష్మి, బాలాజీ, చిట్టిబాబు, జాన్ కెనడీ, బాలసుబ్రమణ్యం, ఎంఎల్‌ఓ దిలీప్‌మొదలి, ఆలయ కమిటీ చైర్మన్లు లారీమోహన్, జయకృష్ణన్, వైఎస్సార్ సీపీ నాయకులు పాల్గొన్నారు.

నాడు–నేడు పనులు వేగవంతం చేయండి



పనులను పరిశీలిస్తున్న ఎంఈఓ శ్రీదేవి

నగరి: నాడు–నేడు పనులు వేగవంతంగా చేసి రాబోవు విద్యా సంవత్సరం ప్రారంభాని కల్లా పాఠశాలను సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దాలని నగరి ఎంఈఓ శ్రీదేవి ఆదేశించారు. శుక్రవారం మండలంలోని మునెప్పనాయుడు కండ్రిగ ప్రాథమిక పాఠశాలలో జరుగుతున్న నాడు–నేడు పనులను ఆమె పరిశీలించారు. ఏ మేరకు పనులు చేశారు, ఇంకనూ ఏయే పనులు చేయాలో కాంట్రాక్టర్‌ను అడిగి తెలుసుకున్నారు. నాడు–నేడు పనులు నిర్దేశిత గడువులోపు పూర్తి చేసేలా ప్రధానోపాధ్యాయులు పర్యవేక్షించాలని సూచించారు. మునెప్పనాయుడు కండ్రిగ ప్రాథమిక పాఠశాలలో ఒకేరోజు మరుగుదొడ్లు, అదనపు తరగతి గది రెండింటినీ స్లాబ్ వేయడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు పవన్ కుమార్, పాఠశాల చైర్‌పర్సన్ భువనేశ్వరి, ఇంజినీరింగ్ అసిస్టెంట్ ఏలుమలై, ఎడ్యుకేషనల్ అసిస్టెంట్ కిరణ్ కుమార్, గ్రామస్తులు పాల్గొన్నారు.

బ్రహ్మోత్సవాలకు అంకురార్పణ





పూజా సామగ్రి ఊరేగింపు, మాడ వీధుల్లో ఊరేగుతున్న విష్వక్సేనుడు

కార్వేటినగరం: రుక్మిణీ, సత్యభామ సమేత శ్రీ వేణుగోపాలస్వామి ఆలయంలో వార్షిక బ్రహ్మోత్సవాలను పురస్కరించుకుని అంకురార్పణ ఘనంగా నిర్వహించారు. టీటీడీ ఆధ్వర్యంలో శుక్రవారం పుట్టమట్టితో అమ్మవారిని ప్రతిష్టించి ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. స్వామివారి బ్రహ్మోత్సవాలకు సకల దేవతలను ఆహ్వానిస్తూ విష్వక్సేనుడికి ప్రత్యేక పూజా కార్యక్రమాలు చేశారు. అనంతరం విష్వక్సేనుడిని మాడవీధులలో మేళతాళాల నడుమ ఊరేగించారు. శనివారం ఉదయం ధ్వజారోహణంతో బ్రహ్మోత్సవాలు ప్రారంభం కానున్నాయి. ఈ ధ్వజారోహణానికి అవసరమైన పట్టువస్త్రాలు, పూలమాలలు, కొడుతాడు, ఆంజనేయస్వామి పతాకాన్ని ఉభయదారు సుబ్రమణ్యం ఊరేగింపుగా తీసుకొచ్చి ఆలయ అర్చకులకు అందించారు.

గృహ నిర్మాణ పనులు వేగవంతం



గృహ నిర్మాణ పనులను పరిశీలిస్తున్న ఎంపీడీఓ ఆర్ శ్రీనివాసన్

పాలసముద్రం : మండల పరిధిలో ప్రభుత్వం మంజూరు చేసిన గృహనిర్మాణ పనులు వేగవంతం చేయాలని ఎంపీడీఓ ఆర్ శ్రీనివాసన్ కోరారు. శుక్రవారం తొట్టికండ్రిగ జగనన్న లేవుట్‌లో గృహనిర్మాణ పనులను పరిశీలించారు. లబ్ధిదారులతో ఎంపీడీఓ మాట్లాడుతూ ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా చేపట్టిన గృహనిర్మాణ పనులు వేగవంతం చేయాలని చెప్పారు. ఉచితంగా ఇసుక, తక్కువ ధరకు సిమెంట్, సకాలంలో బిల్లులు ఇస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో విస్తరణాధికారి రమేష్, హౌసింగ్ ఏఈ మధు, సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.

టెన్త్ ప్రతిభావంతులకు సన్మానం



విద్యార్థులను సన్మానిస్తున్న హెచ్‌ఎం, టీచర్లు

వడమాలపేట : ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్యను అందిస్తున్నామని, అందుకే పదవ తరగతి పబ్లిక్ పరీక్షల్లో మంచి ఫలితాలు సాధించామని ఎస్‌బీఆర్ పురం ప్రధానోపాధ్యాయులు నీరజారాణి అన్నారు. శుక్రవారం ఎస్‌బీఆర్ పురం జెడ్పీ హైస్కూలులో మండలంలోని ప్రభుత్వ పాఠశాలల్లో అత్యధిక మార్కులు సాధించిన చాందినితో పాటు మార్కుల పరంగా సత్తా చాటిన వైష్ణవి, జోషన్‌తోపాటు మరో విద్యార్థిని సన్మానించారు. ఆమె మాట్లాడుతూ, ప్రభుత్వ స్కూళ్ల ప్రసుత్తం మౌలిక వసతులతో కార్పొరేట్ పాఠశాలల కంటే మిన్నగా ఉంటున్నాయన్నారు. వీటితోపాటు విద్యార్థులకు పుస్తకాలు, యూనిఫాం, మధ్యాహ్న భోజనం, స్నాక్స్ మొదలైనవి ప్రభుత్వం కల్పించిందన్నారు. కార్యక్రమంలో పాఠశాల విద్యాకమిటీ చైర్‌పర్సన్ లలిత, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు, విద్యార్థులు పాల్గొన్నారు.